# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

మంగళవారం | 22 | జూలై | 2025 | పేజీలు: 6


## అమ్మకు సారె సమర్పించేందుకు పోటీ పడ్డ భక్తులు



5 లో





6 లో

-విజయవాడ పశ్చిమ, మనం న్యూస్

# పశ్చిమ అభివృద్ధికి

- మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం
- రూ. 48.23 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎన్నికల్లో చెప్పిన ప్రతి పని చేస్తున్నాం
- ఎమ్మెల్యే సుజనా చౌదరి

# రాజకీయాలకు అతీతంగా కలిసి రండి

## డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై దృష్టిపెట్టండి

- విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు
- ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి
- వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్.
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ



2 లో

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్



2 లో

## జీవన ఎరువులతో పంటకు బలం

- పచ్చిరొట్ట పైర్లతో 25 శాతం వరకు ఎరువులు ఆదా
- అన్నదాతలూ.. అవగాహన పెంచుకొని అడుగేయండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

# జీవన ఎరువులతో పంటకు బలం



**మొదటి పేజీ తరువాయి...**

**విజయవాడ సెంట్రల్, జూలై 21 (మనం న్యూస్):** విజీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులను ఆదా చేయొచ్చని.. అదేవిధంగా పచ్చిరొట్ట పైర్ల ఎరువులను వాడటం ద్వారా 25 శాతం ఎరువులను ఆదా చేయొచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పచ్చిరొట్ట పైర్లు, జీవన ఎరువుల ప్రయోజనాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లతో నేలసారం పెరుగుతుందని, నేలలో పోషకాల వృధా తగ్గుతుందన్నారు. ఆరోగ్యకర నేల వల్ల ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులు లభిస్తాయన్నారు. అదేవిధంగా రైజోబియం, అజోటోబాక్టర్, అజోస్పైరిల్లం, బ్లూ గ్రీన్ ఆల్గే, అజోల్లా, మైకోరైజా వంటివి వాతావరణ నత్రజనిని మట్టిలో నిలిపి మొక్కకు ఉపయోగపడేలా చేస్తాయన్నారు. జీవన ఎరువులు వినియోగించేటప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పాటించాలన్నారు. ఈ జీవన ఎరువుల కాలపరిమితి 6-12 నెలలు ఉంటుందని, రసాయనిక ఎరువులు, కీటకనాశకాలతో కలిపి వేయకూడదని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వాడటం మంచిదని, ఈ అంశాలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అన్నదాతలకు అవగాహన కల్పించాలని, ఇందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. పెట్టుబడుల ఖర్చును తగ్గించుకొని సాగును లాభసాటిగా మార్చుకోవడంలో రైతులను చేయిపట్టి నడిపించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన కళాశాలలో పూర్వ విద్యార్థుల ధర్నా




**విజయవాడ సెంట్రల్, జూలై 21(మనం న్యూస్):** లోక్ అదాలత్ తీర్పును అడ్డం పెట్టుకుని శాతవాహన కళాశాలను ఆక్రమించుకుని, కొన్ని భవనాలను రాత్రికి రాత్రి కూల్చి వేసిన సంగతి అందరికి తెలిసిందే. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు కొందరు ముందుకు వచ్చి కళాశాల పరిరక్షణ కమిటీ గా ఏర్పడి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారుల్ని, ఎమ్మెల్యే లను కలిశారు. దాదాపుగా 45 రోజులు దాటినప్పటికీ కళాశాల మళ్ళీ ప్రారంభం చేయడానికి ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ లు ముందుకు రాకుండా కళాశాల స్థలాన్ని ఆక్రమించిన బోయపాటి వారితో కుమ్మక్కయ్యారని పూర్వ విద్యార్థులు ఆరోపించారు. నూతన విద్యా సంవత్సరం మొదలైనా, డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం అవుతున్న తరుణంలో పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి వామపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల సమన్వయంతో కళాశాల సొసైటీ సభ్యుల సహకారంతో సోమవారం ఉదయం ప్రదర్శనగా వెళ్లి కళాశాల సెక్యూరిటీతో గేటు తాళం తీయించి, లోపలకు ప్రవేశించారు. కొద్ది సేపు ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న సూర్యారావు పేట సి ఐ ఆలీ తన పోలీసు సిబ్బందితో వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. కళాశాల సొసైటీ అధ్యక్షులు పిన్నమనేని కృష్ణమోహన్ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు వి శ్రీనివాసరావులు కూల్చి వేసిన వారిని ఏ మాత్రం చర్యలు తీసుకోకపోగా మా కళాశాల లోకి వెళుతున్న మమ్మల్ని అడ్డుకునే హక్కు మీకు గానీ మరెవ్వరికి గానీ లేదని కోర్టు ఉత్తర్వులు చూపించగా వెనుతిరిగి వెళ్ళిపోయారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్తత జరిగింది. అనంతరం కళాశాల అధ్యాపక సిబ్బంది గదుల్ని శుభ్రం చేయించి ద్వితీయ ఏడాది డిగ్రీ విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాకుండా డిగ్రీలో చేరే వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ నగర కార్యదర్శి కుమార స్వామి, పిడిఎస్ యూ నగర కార్యదర్శి ఐ రాజేష్ , వై ఎస్సార్ సంఘం అధ్యక్షులు ఏ రవిచంద్ర, ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి కే పోలారి , మహిళా సంఘం కార్యదర్శి పి పద్మ, పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి విష్ణువర్ధన్ ప్రచార కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్ , వల్లూరు నాగబాబు, రవికిరణ్, సైనుద్దీన్, సొసైటీ ఉపాధ్యక్షులు వి సాంబిరెడ్డి, ప్రణీత , పి.కృష్ణ, రవీంద్ర, రమణ, తదితరులు పాల్గొన్నారు.

### అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం

శాతవాహన కళాశాలలో డిగ్రీ లో బి ఎ , బి కామ్, బి ఎస్ఎస్సి కోర్సుల్లో ప్రవేశానికి ఆన్ లైన్ ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని వైఎస్ ప్రిన్సిపాల్ కుందేటి కోటేశ్వరరావు తెలిపారు. పేద విద్యార్థులకు తక్కువ మొత్తం ఫీజులు మాత్రమే అని తెలిపారు.

## బీజేపీ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**విజయవాడ పశ్చిమ, జూలై 21 (మనం న్యూస్):** భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు అయింది. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సోమవారం సోషల్ మీడియా వేదికగా నూతన కార్యవర్గ నియామక పత్రాన్ని విడుదల చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత పైలా సురేష్ ను ఎన్టీఆర్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా అవ్వారు బుల్లబ్బాయి ను ఎన్టీఆర్ జిల్లా కోశాధికారిగా, డాక్టర్ దుర్గా శ్రీలక్ష్మిను ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా నున్న కృష్ణ ను ఎన్టీఆర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా నియమించారు.

# ఆర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా అర్జీలను పరిష్కరించండి

- **ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**



**విజయవాడ సెంట్రల్, జూలై 21 (మనం న్యూస్):** ఆర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా అర్జీలకు పరిష్కరించుపాలని, నిర్ధేశించిన సమయంలో అర్జీలను పరిష్కరించాల్సిందేనని ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ఉపేక్షించబోనని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జీదారుల సంతృప్తి చేందాలనే లక్ష్యంతో అధికారులు సమస్యలను నిర్ధేశించిన సమయంలో పరిష్కరించాలని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించిన ఉపేక్షించే ప్రశక్తే లేదని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో గ్రీవెన్స్ సెల్కు ఆశ్రయిస్తారన్నారు. వారి నమ్మకానికి బలం చేకూర్చే విధంగా నాణ్యతా ప్రమాణాలతో ఆర్జీలను పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. అర్జీలు ఎట్టిపరిస్థితులతో పెండిరగ్ ఉండరాదన్నారు. వ్యక్తిగత సమస్యలు ఎదురైనప్పుడు పడే ఇబ్బందులు పరిష్కరించుకోవాలనే తపన అధికారులకు ఎలా ఉంటుందో ప్రజలకు కూడా ఆదే విధమైన భావన ఉంటుందనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకుని సేవ చేస్తున్నాననే మానవతాదృక్పథంతో సమస్యల పరిష్కారం పై దృష్టిపెట్టాలన్నారు. నమోదైన ఆర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారుల నుండి తగిన సమాచారాన్ని సేకరించి అర్జిదారులను సంతృప్తి పరచడమే ధ్యేయంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చాలన్నారు. ఆర్జీల పరిష్కారంపై తాను ప్రతి రోజు సమీక్షాన్నానని ఆర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

### 169 అర్జీల స్వీకరణ....

రెవెన్యూ శాఖకు సంబంధించి 46, పోలీస్ శాఖకు 26, విద్య 23, ఏపిఎస్డబ్ల్యుఆర్ఇఐఎస్ 12, పంచాయతీరాజ్ 9, ఏపిసిపిడిసిఎల్ 8, పౌరసరఫరాలు 5, విభిన్న ప్రతిభావంతులు 5, డిఆర్డిఏ 5, ఎండోమెంట్స్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 3, ఆర్ఐవో 3, ఆర్డబ్ల్యుఎస్ 3, హెల్త్ 2, సోషల్ వెల్ఫేర్ 2, సర్వే 2, వ్యవసాయం, పశుసంవర్ధక, కో - ఆపరేటివ్, అటవీ, జిఎస్డబ్ల్యుఎస్, హౌసింగ్, ఐసిడిఎస్, లీడ్ బ్యాంకు మేనేజర్, నైపుణ్యాభివృద్ధి, నీటివనరులు కు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 169 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్వో ఎం లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఏఎన్వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి రండి

- **అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే సుజనా చౌదరి**



**విజయవాడ పశ్చిమ, జూలై 21 (మనం న్యూస్):** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు.. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి మరిన్ని అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే సుజనా కోరారు. సోమవారం 56 వ డివిజన్ పాత రాజా రాజేశ్వరి పేట లోని జేపీ అపార్ట్మెంట్ డీ బ్లాక్ నుండి స్కై మెడికల్ అండ్ ఫాన్సీ షాప్ వరకు రూ 49.95 లక్షల నిధులతో 690 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, లైన్ నిర్మాణ పనులను , మహంకాలమ్మ టెంపుల్ జంక్షన్ నుండి రైల్వే గేటు వరకు పెవర్ బ్లాక్స్ తో రహదారి విస్తరణకు రూ 48 .23 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎర్ర కట్ట డౌన్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జేపీ అపార్ట్మెంట్ నివాసితులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్లు , డ్రైనేజీల ను నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే అప్రోచ్ రోడ్, వాటర్ ట్యాంక్ నిర్మాణం,పార్క్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు . పశ్చిమ లోని మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నానన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం అందరం కలిసి సమిష్టిగా ప్రజాసేవలో భాగస్వామ్యులం కావాలన్నారు. ఎన్నికల్లో చెప్పిన ప్రతి పని చేస్తున్నామని తెలిపారు.. వైసీపీ కార్పొరేటర్లు అభివృద్ధికి సహకరించాలని కోరారు . అభివృద్ధి విషయం లో రాజకీయాలకతీతంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. బుడమేరు ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పశ్చిమ ప్రజలకు ఎల్లవేళలా ఎన్డీఏ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈ ఈ జె శ్రీనివాస్, డీ ఈ మాధవి, ఏ ఈ జాస్మిన్,కార్పొరేటర్లు బుల్లా విజయ్, యలకల చలపతిరావు, టీడీపీ అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీ, కూటమి నేతలు కోగంటి రామారావు, దనేకుల సుబ్బారావు, వరప్రసాద్, పెద్ది శ్యామ్ సుందర్,రౌతు వాసు, నున్నా కృష్ణ, దేవకి, రెడ్డిపల్లి రాజు, పైలా సురేష్, జేపీ అపార్ట్మెంట్ వాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

# డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై దృష్టిపెట్టండి



**విజయవాడ సెంట్రల్, జూలై 21 (మనం న్యూస్):** విజయవాడ నగర పరిధిలో డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిపెట్టాలని, నిర్వహణ పరంగా ఎక్కడా లోపాలు ఉండటానికి వీల్లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ అధికారులకు స్పష్టం చేశారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం వివిధ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ముందు పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్డు, వన్టౌన్ లో బ్రిడ్జ్ ప్రాంతాలను పరిశీలించగా.. పీజీఆర్ఎస్ కార్యక్రమం ముగిసిన అనంతరం దేవీనగర్, న్యూ రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, సక్రమ మురుగునీటి పారుదల, రక్షిత తాగునీరు అనేవి ప్రజల ఆరోగ్య భద్రతకు చాలా కీలకమని డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకుంటే మురుగునీరు రోడ్లపైకి చేరడంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు డెంగీ, మలేరియా, చికున్గున్యా వంటి విష జ్వరాల బారినపడే ప్రమాదముందన్నారు. వరద, మురుగునీటి కాల్వల్లో ఎక్కడా అడ్డంకులు ఉండటానికి వీల్లేదని, ఒకవేళ ఏదైనా సమస్య ఏర్పడితే యుద్ధప్రాతిపదికన సమస్యను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు పూడికలు అనేవి లేకుండా చూడాలన్నారు. చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటిని కాలువల్లోకి నెడితే తిరిగి ఆ చెత్తే అంతులోని అనారోగ్యాల రూపంలో మన నెత్తినపడుతుందని.. వ్యర్థాలను సరైన విధంగా వేరుచేసి, పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వడం, పాలిథీన్ కవర్లు వంటివాటిని వాడకుండా, ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించేలా అవగాహన కల్పించాలని, సామాజిక స్పృహ, క్రమశిక్షణ మనల్ని, మన కుటుంబాలను, సమాజానికి రక్ష అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

# గ్రామీణ రోడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్ల పై రాకపోకలను కట్టడి చేయండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ సెంట్రల్, జూలై 21 (మనం న్యూస్):** పంచాయతీరాజ్ రోడ్లు నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లు పై రాకపోకలను పూర్తిగా కట్టడి చేయాలని, ఓవర్ లోడ్తో తిరిగే రోడ్ల పైకి వాహణాల రాకపోకలు పూర్తిగా నిషేందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. స్వరాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్ రోడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్లు మరమత్తులకు గురికాకుండా అధికారులు ముందస్తు జాగ్రతలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వరి నాట్లు వేసే సమయం ఆసన్నం కావడంతో రైతులు పంట పోలాలలో దుక్కిదున్నే ఏర్పాట్లు చేసుకుంటారన్నారు. ఈ తరుణంలో దమ్ము చక్రాల ట్రాక్టర్లతో దుక్కిదున్నడం జరుగుతుందని ఒక ప్రాంతం నుండి మరోక ప్రాంతానికి దమ్ము చక్రాలతోనే ట్రాక్టర్ యజమానులు రహదారులపై రాకపోకలను సాగిస్తున్నారన్నారు. ఇది పూర్తిగా నిషేదమని ఇటువంటి వాటి వలన రోడ్లు కోతకు గురై త్వరగా దెబ్బతింటాయని దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై పై తిరగకుండా పూర్తిగా కట్టడి చేయాలన్నారు. రోడ్లు ప్రక్కన మొక్కలను నాటి సంరక్షణ భాధ్యతలను చేపట్టి రోడ్ల మార్జన్స్ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక బరువుతో వాహనాలు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్రాస్ రోడ్లు, మలుపులు, కల్వర్ట్ ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించేలా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. రోడ్లు వెంట వాహనాల పార్కింగ్ను నివారించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈవో జెడ్.రమేష్, డీఈ కె.సరస్వతి, ఏఈలు వి.శ్రీనివాసరావు, ఎన్. శివరామకృష్ణ, ఈఏ పూర్ణశశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపూడి లో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే వసంత



**విజయవాడ రూరల్, జూలై 21, మనం న్యూస్:** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. సోమవారం విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడికి చెందిన 6 గురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10,13,329లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన చెక్కులను స్థానిక శాసనసభ్యులు కృష్ణ ప్రసాదు గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులతో పాటు సీఎం. చంద్రబాబు సందేశ పత్రాలను కూడా ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేసి లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి పై వాకబు చేశారు. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం కి, శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ నర్రా వాసు , కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టి బాబు, స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ బృందం పర్యటన



**ఉయ్యూరు, జులై 21 (మనం న్యూస్):** స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా జిల్లా స్వచ్ఛ సర్వేక్షన్ 25 మిషన్ బృందం సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డి ఎల్ పి ఓ సంపత కుమారి నేతృత్వంలోని మూడు బృందాలు మండలంలోని కాటూరు, బొళ్లపాడు, ముదునూరు గ్రామాల్లో పర్యటించి గ్రామ పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో అమలవుతున్న పారిశుధ్య పనులను, తడి చెత్త పొడి చెత్త సేకరణను, మురుగునీటి పారుదల సౌకర్యాలను, ప్లాస్టిక్ వాడక నిర్మూలన కార్యక్రమాలను తనిఖీ చేసారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను, పాఠశాలలను, కార్యాలయాలను పరిశీలించి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరును ప్రశంసిస్తూ అభినందించారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జివిస్వి శేషగిరిరావు డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరావు, కాటూరులో సర్పంచ్ కె. ఆశాజ్యోతి, బోళ్లపాడులో సర్పంచ్ టి సురేష్ రెడ్డి ముదునూరులో సర్పంచ్ ఎం నాగలక్ష్మి లతోపాటు ఆయా గ్రామాల కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆహార వ్యాపారులకు ఫాస్టాక్ సర్టిఫికెట్లను అందజేసిన మున్సిపల్ చైర్మన్



**జగ్గయ్యపేట జులై 21 మనం న్యూస్:** పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ పార్ట్నర్ కెవిజివిఎం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత సంస్థ (ఫాసి) ఆమోదించిన ఫాస్టక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకున్న జగ్గయ్యపేట పట్టణ ఆహార వ్యాపారులకు సర్టిఫికెట్లను సోమవారం జగ్గయ్యపేట పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతి ఆహార వ్యాపారి వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఆదాయమే ప్రధానం కాకుండా మీ మనస్సాక్షి తో ఆలోచించుకుని పరిశుభ్రమైన ఆహారం ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, మీ మీ వ్యాపారాలకు ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ తో పాటుగా ఈ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, ప్రతి వ్యాపారి హోటల్లు, రెస్టారెంట్లు, తినుబండారాల అమ్మే ప్రతి వ్యక్తికి ఈ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని, పాస్టాక్ ముఖ్య ఉద్దేశంగా పరిసరాల పరిశుభ్రత, ఆహార భద్రత,నాణ్యత పాటించడం,కల్తీని గుర్తించడం వంటి ప్రజలకు ఉపయోగకరమైనవి ఉన్నాయని ఈ ట్రైనింగ్ తీసుకున్న వాళ్ళందరూ వీటన్నిటి విషయంలో జాగ్రత్తగా ఉంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా ఫాస్టాక్ ఇంచార్జి అధికారి మోహన బాబు, మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు, కౌన్సిలర్ సభ్యులు కన్నెబోయిన రామలక్ష్మి, ఇ ౖరి నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

## ఈడుపుగల్లు క్యాంపస్ పై చర్యలు తీసుకోవాలి



**మచిలీపట్నం, జూలై 21 (మనం న్యూస్):** నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న శ్రీ సాయి జూనియర్ కాలేజ్ అన్ అకాడమీ ఈడుపుగల్లు క్యాంపస్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మీకోసం అనే కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావుకి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎస్.సమరం మాట్లాడుతూ కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు లో ఉన్న శ్రీ సాయి జూనియర్ కాలేజీ అన్ అకాడమీ అక్రమ వసూలు పాల్పడుతూ విద్యార్థుల వద్ద ఫీజు మొత్తం చెల్లించిన విద్యార్థుల నుండి అధిక ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. 30 వేల నుండి 25 వేలు వరకు చెల్లిస్తేనే విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తామని బెదిరిస్తూ తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. శ్రీ సాయి జూనియర్ కాలేజీ యాజమాన్యం చెల్లెలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు.

## రాష్ట్ర సమగ్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



**విజయవాడ రూరల్, జూలై 21(మనం న్యూస్) :** ప్రజాసంక్షేమంతో పాటు సమగ్రాభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ రూరల్ మండలంలోని రాయనపాడు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు పాల్గొని ఇంటింటికీ వెళ్లి వారికి సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయా, వివిధ పథకాల వల్ల లబ్ది చేకూరిందా లేదా, అంటూ ఆరా తీశారు. తల్లికి వందనం, దీపం పథకం కింద సొమ్ము జమ అయిందా అంటూ లబ్ధిదారులను ప్రశ్నించారు. పింఛన్లు ప్రతి నెల సక్రమంగా అందుతున్నాయా అంటూ అడిగారు. సంక్షేమ పథకాల అమలు వల్ల లబ్ధిదారులైన ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏపీని ప్రగతి బాటలో పయనింప చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్రా వాసు, స్థానిక ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత దర్శి రామారావుకు మొండితోక సోదరులు ఘన నివాళి



**చందర్లపాడు, జులై 21 .మనం న్యూస్:** మండలం లోని లక్ష్మీపురం గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు దర్శి రామారావు పెద్దకర్మ కార్యక్రమం లో సోమవారం నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ పార్టీ నాయకులతో కలసి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు జడ్పిటిసి సభ్యులు ముక్కపాటి నరసింహారావు, వైసిపి నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, కందుల నాగేశ్వరరావు, కోనాయపాలెం వైసిపి నాయకులు బుగ్గనేని సురేష్, కన్నెగంటి జీవ రత్నం తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మొండితోక జగన్మోహనరావు

**నందిగామ రూరల్, జూలై 21 (మనం న్యూస్):** మండలం లోని అడవిరావులపాడు గ్రామంలో పార్టీ నాయకులు వేల్పుల లక్ష్మయ్య కుమారుని వివాహానికి సోమవారం నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకులతో కలసి హాజరైనారు .వధూవరులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వాసవి క్లబ్ నందనవనం ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



**జగ్గయ్యపేట, జూలై 21 మనం న్యూస్:** జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యపుట్టినరోజు సందర్భంగా వాసవి క్లబ్ నందనవనం ఆధ్వర్యంలోసెంట్రల్ స్కూల్లో నందు హెడ్మాస్టర్ మేడం విజయశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు బుక్స్ , పెన్నులు పంపిణీ నిర్వహిం చారు.అనంతరం 22వ వార్డు 1 వ అంగన్వాడి నందు చిన్నారులకు కేకులు మరియు చాక్లెట్లు పంపిణీ చేశారు. మరియు 20వ వార్డు 2 వ సెంటర్ నందు చిన్నారులకు కేకులు చాక్లెట్లు మంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయమ్మలు, ఆర్ సి మద్దుల ఉమామహేశ్వరావు, ఆర్ఎస్ రాయపూడి శ్రీకాంత్, జెడ్ సి కర్లపాటి వెంకటేశ్వరరావు , డిపిఓచిత్తలూరి చంద్రశేఖర్, మాజీ ఆర్ఎస్ మరియు సలహాదారుడు అయినటువంటి చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్ మరియు మాజీ ట్రెజరర్ కరుణాకర్, ఆర్యవైశ్య ప్రముఖులు, డోగుపర్తి రాము, ఆనందవనం ప్రెసిడెంట్, పబ్బతి జగదీష్, కపుల్స్ క్లబ్, సన్నీ కిరణ్, సెక్రెటరీలు ట్రెజరర్లు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనాసాగరం రైతుల విజ్ఞప్తిపై తక్షణ స్పందన



**నందిగామ టౌన్, జూలై 21 (మనం న్యూస్):** నందిగామ పట్టణం అనాసాగరం గ్రామంలో రైతులు తమ పంట పొలాలకు సాగునీరు అందించాలని చేసిన విజ్ఞప్తిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెంటనే స్పందించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తన సొంత నిధులతో అనాసాగరం-శనగపాడు సప్లై ఛానల్లో పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తంగిరాల సౌమ్య స్వయంగా హాజరై, కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. అనాసాగరం గ్రామ రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి సమస్యను గుర్తించిన తంగిరాల సౌమ్య , సాగునీరు సకాలంలో పొలాలకు అందేలా చేయడానికి ఈ చొరవ తీసుకున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా నీటి ప్రవాహం సాఫీగా సాగి, రైతుల పంటలకు అవసరమైన నీరు అందనుంది. ఈ పనులు పూర్తయితే గ్రామంలోని వందలాది ఎకరాల పంట పొలాలు సాగునీటి సౌకర్యాన్ని పొందనున్నాయి. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, రైతులు అన్నదాతలు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించడం మా ప్రభుత్వ బాధ్యత. అనాసాగరం రైతుల సమస్యను సొంత సమస్యగా భావించి, తక్షణ చర్యలు చేపట్టాము. ఈ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రతి రైతు పొలానికి నీరు అందేలా చేస్తాము,' అని హామీ ఇచ్చారు. గ్రామ రైతులు ఈ చొరవను స్వాగతిస్తూ, సౌమ్య సత్వర స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. 'మా సమస్యను వెంటనే పరిగణనలోకి తీసుకుని, సొంత నిధులతో పనులు ప్రారంభించిన ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే కి మా ధన్యవాదాలు. ఇది మాకు ఎంతో ఊరటనిచ్చింది,' అని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకులు, కూటమి నేతలు మరియు అధికారులు పాల్గొన్నారు. ఈ పనులు త్వరలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తంగిరాల సౌమ్య ఈ చొరవ గ్రామ రైతులకు కొత్త ఆశలను రేకెత్తించింది

# ఆషాడ మాస సారే కార్యక్రమంలో పాల్గొన్న తంగిరాల సౌమ్య

**నందిగామ రూరల్, జూలై 21 మనం న్యూస్:** మండలం లోని అంబారుపేట గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం నాడు జరిగిన ఆషాడ మాస సారే కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొని, భక్తులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంతీయ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విశేష గుర్తింపు పొందింది,ఆషాడ మాస సారే కార్యక్రమం భక్తుల మధ్య ఐక్యతను మరియు ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తుందని అన్నారు. తంగిరాల సౌమ్య దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆషాడ మాస సారే కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, పలువురు ప్రముఖులు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




**జగ్గయ్యపేట జూలై 21 మనం న్యూస్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులకు 26వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం జగ్గయ్యపేటలో పాత మున్సిపల్ కార్యాలయం నందు సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరాన్ని తన్నీరు నాగేశ్వరరావు సందర్శించి మద్దతు ప్రకటించారు. న్యాయపరమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు. తక్షణమే జీవో నెంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, ఆప్కాస్ పరిధిలో ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కళ్ళు తెరచి సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కార్మికులకు పారిశుధ్య సామాగ్రి అందించాలని, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని, ఇంజనీరింగ్ వర్కర్స్‌కు కనీస వేతనం అమలు చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. మున్సిపల్ కార్మికులకు న్యాయం జరిగే వరకూ వారికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, తమ మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజ్ జున్నీసా, దివ్వెల రామారావు, పెంటి శ్రీనివాసరావు, నంబూరి రవి, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, బాణావత్ రాజు, పిడమర్తి ప్రభు, మన్నె అప్పారావు, దర్శి వెంకటేశ్వర్లు, అమ్మనబోయిన గోపి, షేక్ ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మకు బంగారు మంగళ సూత్రాలు విరాళం



**విజయవాడ పశ్చిమ, జూలై 21 (మనం న్యూస్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపైన వేంచేసిఉన్న కనకదుర్గమ్మకు ఓ భక్తుడు బంగారు మంగళ సూత్రాలు విరాళంగా సమర్పించారు. విజయవాడ రామలింగేశ్వరపేటకు చెందిన జంధ్యాల కుమారస్వామి కుటుంబం సభ్యులు సోమవారం నాడు అమ్మవారి కి కానుకగా సమర్పించిన రెండు బంగారు సూత్రాలు, బంగారు గొలుసు మొత్తం 61 గ్రాములు. కాగా దీని విలువ సుమారు ఐదు లక్షలు ఉంటాయని చెప్పారు. వస్తువును ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబానికి అమ్మవారి దర్శనం, అమ్మవారి చిత్రపటం అందించి, వేద ఆశీర్వచనం అందించారు.

# జగ్గయ్యపేట లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు




**జగ్గయ్యపేట జూలై 21 మనం న్యూస్:** లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట మరియు డాక్టర్ వైయస్ జగన్ మోహన్ రావు మెమోరియల్ చైల్ కేర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారంజిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ నందు 720 మంది విద్యార్థి విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు డాక్టర్ టీ.సునీత పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ఉచిత కంటి పరీక్షలో 20 మంది విద్యార్థి విద్యార్థులకు కళ్ళజోళ్ళు అవసరమని గుర్తించి వారికి లయన్ శ్రీరాం బదరినారాయణ ఆర్థిక సహాయంతో ఉచిత కళ్ళజోళ్ళు ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వపు గవర్నర్ లయన్ దేవినేని కిషోర్ కుమార్ పాల్గొని లయన్స్ సభ్యులతో కలిసి కొత్తగా ట్రస్ట్ ఏర్పాటు చేసి మొదటగా ఉచిత చైల్ ఐ క్యాంపును జగ్గయ్యపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా సంతోషకరమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లయన్ శ్రీరామ్ బద్రి నారాయణ ,కార్యదర్శి ఖాసీం సైదా కోశాధికారి రవికుమార్ మొదటి ఉపాధ్యక్షులు కరుణాకర్ ప్రధానోపాధ్యాయులు పి వి నాగేశ్వరరావు ప్రాజెక్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ లయన్ గాంధీ లయన్ ఎస్ వి సత్యనారాయణ లయన్ నారాయణరెడ్డి లయన్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నట్టుగా క్లబ్ కార్యదర్శి లయన్ ఖాసీం సైదా తెలియజేశారు.

# నందిగామలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ




**నందిగామ టౌన్, జూలై 21 (మనం న్యూస్):** నందిగామలో మున్సిపల్ కార్మికులు సోమవారం నాడు ర్యాలీ నిర్వహించారు. నందిగామ మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి, నందిగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డిఓ బాలకృష్ణ కి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి ఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్, మాట్లాడుతూ...ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘం నాయకులను పిలిచి చర్చల జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ నాయకులు పరిమి రవి, తానూరి శ్రావణ్ కుమార్,దారెల్లి అశోక్ కుమార్, కండెల శ్రీను, మార్సపూడి దాసు, బ్రహ్మం, తమ్మవరపు బాల్, అనంద్, తదితరులు పాల్గొన్నారు.

# వీరమ్మతల్లి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



- తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్

**ఉయ్యూరు, జూలై 21 (మనం న్యూస్):** ఉయ్యూరు పట్టణ మహిళలు వీరమ్మతల్లి కి ఆషాఢం సారె అత్యంత వైభవంగా తీసుకొని మేళతాళాల మధ్య కాలినడకన పూలు పండ్లు సారె గాజులు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వై వి బి రాజేంద్ర ప్రసాద్ గారు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉయ్యూరు ప్రజలువీరమ్మతల్లిని తమ ఇలవేల్పుగా భావిస్తారని,వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు ప్రజలు ఆనందంగా ఉండాలని అమ్మవారికి సారె సమర్పిస్తారని అన్నారు, అమ్మవారి దయ వల్లరాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నిండుగా కళకళలాడాలని ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాజేంద్ర ప్రసాద్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో .టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, నేరుసు బాలకృష్ణ,శ్రీకాంత్,నేరుసు గంగాధర్, నేరుసు వీరకుమార్ ,పారుపూడి లక్ష్మీనారాయణ,పారుపూడి వీరభద్రరావు, నవీన్,హరి, చిరంజీవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ లో అధికారులకు ప్రోత్సాహకాలు




**మచిలీపట్నం, జూలై 21, (మనం న్యూస్):** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ముగ్గురు అంతకుమించి పిల్లలు ఉన్న కుటుంబాలలో లక్కీ డిప్ ద్వారా ముగ్గురు ఎస్ నాగజ్యోతి, బొమ్మిడి నాగరాజు, ఎల్ లక్ష్మీపార్వతి లను ఎంపిక చేసి ఒక్కొక్కరికి ప్రశంసా పత్రము, 5 వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతిగా డిఆర్ఓ అదనపు ఎస్పీ అందజేశారు. అలాగే పి పి ఐ యు సి డి, వేసక్టమీ అంగీకరించిన కుటుంబాలలో ముగ్గురిని గంటా యోగి కిరణ్, అనుములకొండ అనుపమ లను ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికి ప్రశంసా పత్రము, 5000 రూపాయలు నగదు బహుమతి ప్రోత్సాహకంగా డిఆర్వో, అదనపు ఎస్పి అందజేశారు.ఉత్తమ గైనకాలజిస్ట్ గా డాక్టర్ సుచిత్ర కు 8000 రూపాయలు, ఉత్తమ వ్యాసకటమి సర్జన్ గా డాక్టర్ హరి రంగ ప్రసాద్ కు 7వేల రూపాయలు, అధిక సంతానం కోసం పాటుపడి ఉత్తమ ప్రేరకులుగా నిలిచిన ఏఎన్ఎం బి వాణికి, ఆశ కార్యకర్త సిహెచ్ యమలీయమ్మ , శ్రీపతి డాలీ సుకన్య లకు ఒక్కొక్కరికి 2500 రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహ బహుమతులు, ప్రశంసా పత్రాలు డిఆర్ఓ అదనపు ఎస్పి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కే కన్నమ నాయుడు, డ్వామా, డి ఆర్ డి ఏ పి డి లు శివప్రసాద్, హరిహరనాదు, డీఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజ, రహదారులు భవనాలు శాఖ ఈఈ లోకేష్, ఐ సి డి ఎస్ పి డి ఎం ఎన్ రాణి, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 72 ఫిర్యాదులు

**విజయవాడ సెంట్రల్, జూలై 21 (మనం న్యూస్):** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 72 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి, సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్. ఉదయారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించడంలో సహకారాన్ని అందించారు.




# దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు పోటీ పడ్డ భక్తులు



**విజయవాడ పశ్చిమ, జూలై 21 (మనం న్యూస్):** అమ్మలగన్నయమ్మ కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి ఆషాఢ సారె సమర్పించేందుకు సోమవారం నాడు ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కళ కళ లాడింది. ఇంటి ఆడపడుచుకు ఏ విధంగా సారె సంభారాలు పెడతారో అదే విధంగా ఎంతో భక్తి శ్రద్దలతో భక్త బృందాలు సామాగ్రి తో తరలి వచ్చారు. నెల మొత్తం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ లక్షలకు పైగా బృందాలు విశేషరీతిలో వచ్చారు. మహా మండపం ఆరవ అంతస్తు వద్ద సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వహించి నారు. అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరలను కార్యనిర్వహణాధికారి శీనానాయక్ సిబ్బందిచే భక్తులు ఇచ్చే చీరలకు కంప్యూటర్లో నమోదు చేయించి భద్రం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ సుమారు 100 మందికి పైగా సభ్యులు గల బృందాలు విశేషరీతిలో వచ్చారు. మహా మండపం ఆరవ అంతస్తు వద్ద సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరల గురించి కార్యనిర్వహణాధికారి శీనానాయక్ సిబ్బందిని వివరణ కోరారు. ఆషాడ మాసం చివరికి చేరుకోవడంతో అనగా ఈనెల 24 తేదీ నుండి ముగియటంతో, మిగతా రెండు మూడు రోజులు కూడా భక్తులు వినియోగించుకుని, శాకంబరీ ఉత్సవాలకు పరిసమాప్తి పలకవలసిందిగా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పట్టాభి భవన నిర్మాణానికి,తోట నరసయ్య నాయుడు విగ్రహ ఏర్పాటుకు కౌన్సిల్లో ఏకగ్రీవ తీర్మానం చేయండి

**మచిలీపట్నం, జూలై 21, (మనం న్యూస్):** ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన సీనియర్ పార్లమెంట్ సభ్యులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణం కొరకు తక్షణమే నగర కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి అనుమతులు మంజూరు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు భవన నిర్మాణం కోసం 40 కోట్ల రూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని కేవలం స్థానిక చెత్త రాజకీయాలతో భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేయడం సమంజసం కాదని బాలాజీ అన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్లు 50 మంది కార్పొరేటర్లు రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి ధ్యాయం గా తీర్మానాన్ని తక్షణమే ఆమోదించి అనుమతులు మంజూరు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. హైకోర్టు లో భవన నిర్మాణం కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసిన పీ.వీ ఫణికుమార్ వాజ్యంలో కూడా రాష్ట్ర హైకోర్టు భవన నిర్మాణానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన విషయాన్ని కౌన్సిల్ సభ్యులు మర్చిపోకూడదు అన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రిసిఫార్సు చేసిన జిల్లా కలెక్టర్, మచిలీపట్నం తాసిల్దారు రెండు ఎకరాలు స్థలాన్ని మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసిన భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయకుండా కాలయాపన చేయటం సమంజసం కాదని బాలాజీ అన్నారు. రాబోయే తరానికి మచిలీపట్నం గత చరిత్రను పట్టాభి సీతారామయ్య గారి జీవిత చరిత్రను మ్యూజియం లోపల అందించడానికి వచ్చిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని బాలాజీ నగర కార్పొరేషన్ కార్యవర్గాన్ని కోరారు. అదేవిధంగా స్థానిక కోనేర్ సెంటర్లో బ్రిటిష్ వారు లాఠీ దెబ్బలకు ఎదురొడ్డి జాతీయ జెండాను ఎగరవేసిన స్వాతంత్ర సమరయోధుడు తోట నరసయ్య నాయుడు విగ్రహాన్ని కూడా తక్షణమే ఏర్పాటు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. పట్టాభి భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని బాలాజీ హెచ్చరించారు. మరో ఎనిమిది నెలల్లో కార్పొరేషన్ కు కొత్త ఎన్నికలు జరుగుతున్నాయని కొత్త కార్యవర్గం వచ్చేలోపు ప్రస్తుత కార్యవర్గం అనుమతులు మంజూరు చేసి మంచి పేరుని సంపాదించాలని బాలాజీ సూచించారు. ఈ సమావేశంలో నోబుల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు న్యాయవాది మద్దాల సువర్ణ రాజు, న్యాయవాది కమ్మిలి విజయకుమార్, సామాజిక కార్యకర్త మల్లంపల్లి వీరాంజనేయు తదితరులున్నారు.



# ఫ్లటర్ ఫ్రేమ్ వర్క్ పై విద్యార్థులకు ట్రైనింగ్

**మైలవరం, జులై 21 మనం న్యూస్:** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఫ్లట్టర్ ఫ్రేంవర్క్ పై వర్క్షాప్ వారం రోజుల పాటు నిరవహించుచున్నారు . ఈ వర్క షాప్ కు యమ్ .రఘువీర్ , ట్రైనర్ ,డేటావాలీ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా అయన ప్రసంగిస్తూ విద్యార్థులకు ఫ్లటర్ ద్వారా ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ రెండింటికీ ఒకేసారి యాప్లను రూపొందించడం, ఫిరేబేస్ వంటి టూల్స్ ఇంటిగ్రేట్ చేయడం, హాట్ రిలోడ్ ద్వారా వేగంగా కోడ్లో మార్పులు చేయడం, రిచ్ యు ఐ డిజైన్ చేయడం పై అవగాహన కల్పించారు. మరియు ఈ వారం రోజుల వర్క్ షాప్ లో ఒకే కోడ్బేస్తో ఆండ్రాయిడ్ మరియు ఐఓ ఏస్ యాప్లను ఎలా రూపొందించాలో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తామని మరియు అంతేకాదు, పూర్వపు మొబైల్ యాప్ డెవలప్మెంట్ పద్ధతులతో పోల్చి, ఫ్లటర్ ఉపయోగాలు ఎలా వుంటాయో ప్రాజెక్ట్ ఆధారంగా విద్యార్థులకు వివరిస్తూ, ఒక ప్రాజెక్టును ప్రారంభం నుంచి డిప్లాయిమెంట్ వరకు ఎలా చేయాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు మాట్లాడుతూ, ఇలాంటివి అవకాశాలుగా కాక, మార్గదర్శకాలుగా పరిగణించాలి. ప్లేసెమెంట్, ఇ ఏం టి పాయింట్స్, మరియు హ్యాకతోన్స్ లో పాల్గొనడానికి అవి ఒక బలమైన పునాది. ఫ్లుట్టెర్ వంటివి విద్యార్థుల్లో క్రియేటివిటీ, లాజిక్, యు ఐ డిజైన్ వంటి నైపుణ్యాలను పెంచుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఐ.టి విభాగాధిపతి డి. రత్న కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం అకడెమిక్ పరంగానే కాక, పరిశ్రమ దృష్టిలో కూడా అప్డేట్ కావాలి. కార్పొరేట్ స్థాయిలో అవసరమయ్యే టెక్నాలజీలను నేర్చుకోవడానికి అందుబాటులో ఉన్న సోర్సును వినియోగించాలి. ఫ్లుట్టెర్ వంటి టూల్స్ ద్వారా విద్యార్థులు ఇండస్ట్రీ - రెడీ ఆప్స్ తయారుచేయగల సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి, అన్నారు. ఈ కార్యక్రమానికి యమ్ .విజయ్ కుమార్ కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు.




# రెండు రోజుల ఇండస్ట్రీ రెడీనెస్ ప్రోగ్రాం



**మైలవరం, జులై 21 మనం న్యూస్:** పరిశ్రమ సంసిద్ధత కార్యక్రమం అనే ప్రోగ్రాం విద్యార్థులను ఐటీ పరిశ్రమలకు కావలసిన విధంగా తీర్చి దిద్దే విధానములో భాగంగా దినేను సంస్థ సీఈఓ శాంతను రాయ్, అఫ్సర్ అన్సారీ, డేటా సైంటిస్ట్ , విద్యార్థులను ఎ ఐ, డేటా సైన్స్ తదితర అంశాలలో ఇంటర్వ్యూ నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమములో విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా ఎలా ఇంటర్వ్యూ ఎదుర్కోవాలి? సమయస్ఫూర్తి తో ఎలా సమాధానములు చెప్పాలి అనే ప్రక్రియను స్వతహాగా ఐటీ పరిశ్రమలలో వివిధ సాంకేతిక అంశాలలో నిష్ణాతులు ఐన ఇంజినీర్ల ద్వారా అవగాహనా పొందుతారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మనో ధైర్యం, సాంకేతిక పరిజ్ఞానంలో వారి యొక్క నైపుణ్యత సామర్థ్యం యొక్క లోటు పాట్లు విద్యార్థులు తెలుసుకోవడం జరుగుతుంది. ప్రిన్సిపాల్ కె.అప్పా రావు మాట్లాడుతూ కళాశాల యొక్క యాజమాన్యం విద్యార్థులకు కావలసిన ఎలాంటి ప్రయోజన కార్యక్రమాలు నిర్వహించడానికి సంపూర్ణ సుముఖతతో వున్నారు. మరియు ఎంతో శ్రద్ధతో విద్యార్థుల భవిష్యత్తుకు కావలసినవి అన్నీ సమకూర్చడంలో ఎంతో ముందంజలో ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రత్నిధులతో పరిశ్రమల లో జరుగుతున్న పురోగతిని గురించి చర్చించారు. సాంకేతిక పోటీ ప్రపంచములో మా విద్యార్థులు ముందుండాలి అంటే ఎలా వారిని సిద్ధం చేయాలో అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలి అని ఏఐ డిఎస్ విభాగాధిపతి మరియు ప్రొఫెస్సర్. పి. భగత్ ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా .శాంతను రాయ్ కళాశాలతో అవగాహనా ఒప్పందం ఏర్పాటు చేయడం హర్షణీయం. శాంతను రాయ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్షిప్స్, ప్రాజెకట్స్ మరియు ప్లేసెమెంట్స్ కూడా కల్పించే విధానములో కలిసి పని చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ ఎం ఓ యు మార్పిడి లో ప్రిన్సిపాల్ కె అప్పా రావు, డీన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ వి.సూర్యనారాయణ, ప్రొఫెసర్ మరియు హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ ఏఐ డిఎస్, పి.భగత్,. దినేను కంపెనీ సీఈఓ శాంతను రాయ్ మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్.శివ రామ కృష్ణ, ఎస్.వి.వి.డి జగదీశ్ లు కోఆర్డినేటర్లు గా వ్యవహరించారు.

# ప్రజలకు సత్వర న్యాయం చేయడమే పిజీఆర్ఎస్ లక్ష్యం

**మచిలీపట్నం, జూలై 21, (మనం న్యూస్):** కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారం నిమిత్తం పలు శాఖలకు వర్చువల్ విధానంలో పంపించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన113 అర్జీలను 72 గంటల్లో పరిష్కరించి అర్జీదారులకు సమాధానాన్ని సంక్షిప్త సందేశం రూపంలో అందించాలని తెలిపారు. పోలీస్ రెవెన్యూ విభాగాలలో అర్జీలు పెండింగ్లో ఉంటున్నాయని వాటిని త్వరితంగా పరిష్కరిస్తామని తెలిపారు.



# ప్రమాదకరంగా మారిన రోలుపడి ప్రధాన రహదారి



**గంపలగూడెం, జూలై 21 (మనం న్యూస్):** తిరువూరు- గంపలగూడెంకు వెళ్ళే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఆటో, కార్లు,బస్సులు,రవాణా చేసే భారీ వాహనాలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రోలుపడి గ్రామంలో మూల మలుపును సూచిస్తూ నిదానంగా వెళ్ళాలని ఏర్పాటు రోడ్లు , భవనముల శాఖ వారు ఏర్పాటు చేసిన బోర్డు సమీపంలో అక్కడ రోడ్డు కుంగిపోవడంతో ఒక్కసారిగా వాహనాలు గోతిలో పడి భారీ కుదుపునకు గురవుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనాదారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముందస్తు ప్రమాదాలను గుర్తించి రహదారిపై పడిన గోతులకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# కామళ్ల జోజిని, సుంకర నారాయణని సత్కరించిన మాజీ మంత్రి



**విజయవాడ పశ్చిమ, జూలై 21 (మనం న్యూస్):** వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా 47వ డివిజన్ చెందిన కామళ్ల జోజి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 45వ డివిజన్ కు చెందిన సుంకర నారాయణ లు ఇటీవల నియమితులయ్యారు.ఈ సందర్భంగా కామళ్ల జోజిని, సుంకర నారాయణలను సోమవారం నాడు స్థానిక బ్రాహ్మణ వీధిలోని వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పశ్చిమ నియోజకవర్గం వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కామళ్ల జోజిని, సుంకర నారాయణలను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నిబద్ధత గల కార్యకర్తలు అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల జీవితాలు చిన్న భిన్నం అయ్యాయన్నారు. వారి జీవితాలలో శాశ్వత వెలుగులు నింపాలంటే మరలా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు పార్టీ కార్యకర్తలు నాయకులు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏక్ పేడ్ మాకేనామ్ కార్యక్రమం




**అవనిగడ్డ, జూలై 21(మనంన్యూస్):** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువభారత్ మై భారత్ ఆధ్వర్యంలో భాగంగా ' ఏక్ పెడ్ మాకే నామ్ ' కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ' తల్లికి వందనం' పేరుతో ఆంధ్ర ప్రదేశ్ లో అనేక చోట్ల ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా మేరా యువ భారత్ మై భారత్ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో సోమవారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ' ఏక్ పెడ్ మాకే నామ్ ' తల్లికి తల్లిపేరుతో ఒక మొక్క నాటండి అనే కార్యక్రమం చేయడం జరిగింది . ముందుగా ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నాలెడ్జ్ కాంపిటీషన్స్ పెట్టడం జరిగింది , అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. అనంతరం ఏక్ పెడ్ మాకే నామ్ ప్రతిజ్ఞను విద్యార్థులతో చదివించడం జరిగింది.

# సొంత నిధులతో పాఠశాల ఆవరణలో ముళ్లపొదల తొలగింపు



**ఇబ్రహీంపట్నం, జూలై21 (మనం న్యూస్):** కొండపల్లి మున్సిపాలిటీ పరిదిలోని కొత్తగేటు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసరావు పి4 కార్యక్రమంలో భాగంగా సొంత నిధులతో కొత్తగేటులోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పెరిగిన ముళ్ల పొదలను జెసిబి సహాయంతో ఆయన తొలగించారు. విద్యార్థులు పాఠశాల మైదానంలో ఆడుకోవడానికి ముళ్ల పొదలు అడ్డంకిగా మారడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయిని మిక్కలి భాగ్యమ్మ కొత్తగేటు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు కోట్ల రాజు, వేముల శ్రీనివాసరావుల దృష్టికి ముళ్ల పొదల సమస్య గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా వేముల శ్రీనివాసరావు మాట్లాడుతూ తరగతి గదులు బావిభారత పౌరులను తయారు చేసే ఖర్మాగారాలని అన్నారు. అటువంటి పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాల్సిన భాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముళ్ల పొదలు పాఠశాల మైదానంలో ఉంటే పాములు, పురుగులు వచ్చే ప్రమాదం పొంచి ఉన్నందున వెంటనే ముళ్ల పొదలు తొలగించేందుకు తాను చర్యలు చేపట్టానని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పైన దృష్టి సారించారని అన్నారు. డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబొరేటరీలు ఏర్పాటుకు లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. రాష్టంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నారా లోకేష్ నడుం బిగించారని అన్నారు. అందులో బాగంగా తాము కూడా మంత్రి నార లోకేష్ ఆధేశాలు తమకు శిరోదార్యమన్నారు. కొత్తగేటు టిడిపి అధ్యక్షుడు కోట్ల రాజు మాట్లాడుతూ తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చేందితే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడులు హౌస్ ఫుల్ బోర్డులు పెట్టాలని నారా లోకేష్ కోరుతున్నారని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మిక్కలి భాగ్యమ్మ , ఉపాధ్యాయులు కృష్ణారావులు పాల్గొని వేముల శ్రీనివాసరావుకు, కోట్ల రాజుకు ధన్యవాదాలు తెలిపారు.

# అభివృద్ధిలో తొలి అడుగు



**పెడన, జులై 21 (మనం న్యూస్ ):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పెడన గూడూరు మండలం చిట్టి గూడూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటినీ సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అభివృద్ధి పనుల గురించి స్థానిక ప్రజలకు వివరించారు. సుపరిపాలనకు తొలి అడుగులో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్ పెడన నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గ్రామ పార్టీ అధ్యక్షులు క్లస్టర్ యూనిట్, పోలింగ్ బూత్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సంవత్సర కాలంలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు చేయబోతున్న మంచిని వివరిస్తారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలుఛిఅధికారులు యూనిట్ బూత్ ఇన్చార్జులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# షిరా డైమండ్స్ షోరూమ్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల




**విజయవాడ తూర్పు, జులై 21 (మనం న్యూస్):** విజయవాడను స్థానికులకే కాకుండా ఇతర ప్రాంతాల వానికి సైతం మహానగరంగా మార్చే ప్రక్రియలో నగరం లో ఆధునిక జీవన శైలిని పెంపొందించడం ఎంతో అవసరమని ఈ నేపథ్యంలో విజయవాడ వేదికగా షిరా డైమండ్స్ ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నగరంలో బెంచ్ సర్కిల్ ప్రాంతంలో గాయత్రి కాంప్లెక్స్ లో షిరా డైమండ్ షో రూమ్ ను ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాలు, ఆహార వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ., షిరా డైమండ్స్ వంటి ఈ తరం మెచ్చే అధునాతన వేదికలు మన యువ తరాలకు అనుగుణంగా డిజైన్లను రూపొందించ డంలో వారి వినూత్న విధానాన్ని తాను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. కష్టమర్లు నచ్చే డిజైనింగ్తో షిరా డైమండ్స్కు మరింత మంచి ఆదరణ లభించాలని మంత్రి ఆశించారు. షిరా డైమండ్స్ను విజయవా డలో ఏర్పాటు చేసిన వ్యవస్థాపకులు శ్రీజ తిప్పల, లీలా యెమెనేని ఆధునిక దృష్టి, కృషి అభినందనీయమని ప్రశంసించారు. సహ వ్యవస్థాపకురాలు శ్రీజ తిప్పల మాట్లాడు తూ., షిరా డైమండ్స్ 18 సంవత్సరాల అనుభవం కలిగిన లెగసీ బ్రాండ్. విజయవాడలో ప్రారంభించబడిన మూడవ స్టోర్ ఇది అని తెలిపారు. ఈ స్టోర్ నగరవాసుల ఆభరణాల అవసరాన్ని పూర్తిగా తీర్చగలదని అన్నారు. షిరా డైమండ్స్లో పోల్కి, కుందన్, డైమండ్, బంగారం ఆభరణాలతో సహా అన్ని వర్గాలకు చెందిన విభిన్న శ్రేణిని డిజైన్లను అందిస్తు న్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా పెళ్లి ఆభరణాలలో ప్రత్యేకత కలిగి ఉన్నామని, సరసమైన బడ్జెట్లలో ఇవి లభిస్తాయని అన్నారు. గ్రాండ్ ఓపెనింగ్ ఈఫర్లలో భాగంగా షిరా డైమండ్స్ బంగారు ఆభరణాలపై 50 శాతం ఫ్లాట్ తగ్గింపు, డైమండ్ క్యారెట్ ధరలపై 25 శాతం తగ్గింపు, పోల్కీ ఆభరణాలపై తయారీ ఛార్జీలు లేదా వృధా రుసుములు ఉండవని అన్నారు. ఇది విజయవాడ ప్రజలకు న్యూ ట్రీట్ అని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# విజయవాడ వెస్ట్ జోన్ సి ఐ లసమావేశం

**విజయవాడ పశ్చిమ, జూలై 21(మనం న్యూస్):** విజయవాడ వెస్ట్ డివిజన్ పరిధిలో ఉన్న వన్ టౌన్, కొత్తపేట ,భవానిపురం ఇబ్రహీంపట్నం స్టేషన్ల సి ఐ ల సమావేశం సోమవారం నాడు విజయవాడలోని విధ్యాధరపురంలో నిర్వహించారు. సురక్ష సమావేశంలో వెస్ట్ డివిజన్ పరిధిలో సిసి కెమెరాలతో పటిష్టమైన నిఘా, గంజాయి అమ్మకాలు మరియు తాగే వారి పై ఉక్కు పాదం, ప్రజా సమస్యలపై పోలీసులు త్వరగా స్పందిస్తున్నారు అంటూ ప్రజల నుండి స్పందన, బార్లు, వైన్ షాపులు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలి వంటి తదితర అంశాలపైన చర్చలు జరిపారు. కాలేజీలు, పాఠశాలల జోన్ల వద్ద సీసీ కెమెరాలతో పాటు పోలీసు సిబ్బందితో పటిష్టమైన నిఘా, పాఠశాలలు, కాలేజీలలో సురక్ష ప్రోగ్రాం పై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.




# పశ్చిమ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి రండి



**విజయవాడ పశ్చిమ, జూలై 21 (మనం న్యూస్):** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు.. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి మరిన్ని అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే సుజనా కోరారు. సోమవారం 56 వ డివిజన్ పాత రాజా రాజేశ్వరి పేట లోని జేపీ అపార్ట్మెంట్ డీ బ్లాక్ నుండి స్కై మెడికల్ అండ్ ఫాన్సీ షాప్ వరకు రూ 49.95 లక్షల నిధులతో 690 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, లైన్ నిర్మాణ పనులను , మహంకాలమ్మ టెంపుల్ జంక్షన్ నుండి రైల్వే గేటు వరకు పెవర్ బ్లాక్స్ తో రహదారి విస్తరణకు రూ 48 .23 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎర్ర కట్ట డౌన్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జేపీ అపార్ట్మెంట్ నివాసితులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్లు , డ్రైనేజీల ను నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే అప్రోచ్ రోడ్, వాటర్ ట్యాంక్ నిర్మాణం,పార్క్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు . పశ్చిమ లోని మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నానన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం అందరం కలిసి సమిష్టిగా ప్రజాసేవలో భాగస్వామ్యులం కావాలన్నారు. ఎన్నికల్లో చెప్పిన ప్రతి పని చేస్తున్నామని తెలిపారు.. వైసీపీ కార్పొరేటర్లు అభివృద్ధికి సహకరించాలని కోరారు . అభివృద్ధి విషయం లో రాజకీయాలకతీతంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. బుడమేరు ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పశ్చిమ ప్రజలకు ఎల్లవేళలా ఎన్డీఏ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈ ఈ జె శ్రీనివాస్, డీ ఈ మాధవి, ఏ ఈ జాస్మిన్,కార్పొరేటర్లు బుల్లా విజయ్, యలకల చలపతిరావు, టీడీపీ అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీ, కూటమి నేతలు కోగంటి రామారావు, దనేకుల సుబ్బారావు, వరప్రసాద్, పెద్ది శ్యామ్ సుందర్,రౌతు వాసు, నున్నా కృష్ణ, దేవకి, రెడ్డిపల్లి రాజు, పైలా సురేష్, జేపీ అపార్ట్మెంట్ వాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.